
ఎడిటర్ :
మంచె శరత్ చంద్ర
సంపుటి : 13
సంచిక : 291
పేజీలు : 5 వెల రూ. 2/-
ఆదివారం
23 నవంబర్ 2025
PUBLISHED FROM :
HYDERABAD

AM న్యూస్
ప్రతిదినం ప్రత్యేకం
www.amnews7.com

## పాలమూరు కార్మికులకు సంక్షేమ సంఘాల ప్రతినిధులు అండగా ఉండాలి...


పట్నంలో పాలమూరు బిడ్డలు పోస్టర్‌ను ఆవిష్కరించిన జూపల్లి కృష్ణారావు



2 లో

# పెన్నులపై మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయ్


- ఆ మాటల్ని నిజం చేసిన కవి అందెశ్రీ
- గత పాలకుల నిర్ణయాల వల్ల జయ జయహే తెలంగాణ గీతం మూగబోయింది: సీఎం రేవంత్‌రెడ్డి




2 లో

## మరింత గడువు ఇవ్వండి

- శాసన సభాపతికి ఎమ్మెల్యేలు దానం, కడియం విన్నపం
- మంత్రి శ్రీధర్‌బాబుతో దానం భేటీ
- రాజీనామా తప్పనిసరైతే.. ప్రత్యామ్నాయంపై చర్చ



2 లో

ఈక్వెస్ట్రియన్ ఫైనల్‌కు

## ముఖ్యఅతిథులుగా జగన్, కేటీఆర్

బెంగళూరు:




బెంగళూరులో శనివారం నిర్వహించిన సర్జ్ ఈక్వెస్ట్రియన్ లీగ్ గ్రాండ్ ఫినాలే పోటీలకు ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. చిక్కజాల పరిసరాల్లోని సర్జ్ స్టేబుల్ ఈక్వెస్ట్రియన్ ఫెసిలిటీ కేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలకు వీరిద్దరూ ట్రోఫీలు అందజేశారు. అంతర్జాతీయ రైడర్లు ఎడ్వర్డ్ స్కీమిజ్, బొండరివా జైన్, షాడీ సమీర్, వ్యాలంటైన్ మార్కట్ ఈ పోటీల్లో పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.

# దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు కుట్రకు తెరలేపిన కాంగ్రెస్ సర్కారు..

- రూ.4.95లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు ప్లాన్..!
- 9,292 ఎకరాలు పప్పుబెల్లంలా పంచిపెట్టే కుట్ర
- 4.95 లక్షల కోట్లు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ పెద్దల స్కెచ్
- దేశంలోనే అతిపెద్ద స్కాంకు తెరలేపిన ప్రభుత్వం
- ఈ స్కాం విలువ రెండేండ్ల రాష్ట్ర బడ్జెట్‌కు సమానం
- ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు
- అది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్యామిలీ పాలసీ
- ఆరు నెలల కిందటే కుట్రలకు పక్కా ప్రణాళిక
- సగం భూములు కొనడానికి బిగ్ బ్రదర్స్ ఒప్పందం
- ఎల్ఆర్ఎస్‌పై పెద్దలకో రూల్.. పేదలకో రూలా?
- రెవెన్యూ, హెచ్ఎండీఏకు పైసా కట్టొద్దని చెప్పుడేంది?
- 30 శాతమే అన్యాయమంటే ఏ ఫీజు వద్దని ఎట్లంటరు?
- 2 నెలల్లోనే ఆగమేఘాల మీద ఎందుకు చేస్తున్నరు?
- అసెంబ్లీలో చర్చించకుండా పాలసీ తేవడం దుర్మార్గం
- వెనక్కి తీసుకోకుంటే బీఆర్ఎస్ పక్షాన పోరాడుతం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం

2 లో



# పెన్నులపై మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయ్

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
నాటి నిజాం నవాబుల నుంచి ఇటీవలి తెలంగాణ మలిదశ ఉద్యమం వరకు కవులు, కళాకారులు ముఖ్యమైన భూమిక పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో రాచరికం, ఆధిపత్యం హద్దు దాటితే.. ఈ నేలను చెరబట్టాలని ప్రయత్నిస్తే.. కవులు, కళాకారులంతా ఏకమై పోరాటాలు చేసి, తరిమేసిన చరిత్ర తెలంగాణ సొంతమని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రముఖ కవి అందెశ్రీ సంతాప సభ జరిగింది. సీఎం రేవంత్ అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు. ఉద్యమ సమయంలో ఎంతో మందిలో స్ఫూర్తిని రగిల్చిన 'జయ జయహే తెలంగాణ'కు తెలంగాణ రాష్ట్రం సాకారమైన తర్వాత అధికారిక హోదా లభిస్తుందని 4కోట్ల మంది ప్రజలు ఆకాంక్షించారని, అప్పటి పాలకుల నిర్ణయాలతో ఆ గీతం మూగబోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. కవులు రాసే పెన్నులపై మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తి గడీలను కుప్పకూలుస్తాయనే మాటలను అందెశ్రీ నిజం చేశారని చెప్పారు.
"అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ గీతాన్ని శాశ్వతంగా అణచివేయాలని గత పాలకులు కుట్రపన్నారు. ఆ గీతం ప్రజల గుండెల్లో ప్రతిధ్వనించినంత కాలం.. గద్దరన్న, గోరటి వెంకన్న, అందెశ్రీ, జయరాజ్‌లే ఉద్యమాన్ని నడిపారనే చర్చ జరుగుతుందని అనుకున్నారు. అందుకే ఉద్యమ స్ఫూర్తి నింపిన కవిత్వాన్ని, గళాల్ని రాష్ట్రంలో వినిపించకుండా చేశారు. ఆనాడు నిజాం నవాబుల కాలంలో ఈ నేలపై ఆధిపత్యాన్ని చెలాయించే సందర్భంలో.. 'బండెనక బండి కట్టి.. ఏ బండిలో పోతావ్ రో.. నైజాం సర్కారోడా' అంటూ బండి యాదగిరి గళం విప్పితే.. నిజాం సర్కారు పీఠమే కదిలింది. ఉమ్మడి రాష్ట్రంలో సీమాంధ్ర నాయకులు ఆధిపత్యం చెలాయిస్తున్నప్పుడు.. దానికి చరమగీతం పాడాల్సిందేనని గద్దరన్న, గూడ అంజన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న మలిదశ తెలంగాణ ఉద్యమానికి పునాది వేశారు. ఎన్నడూ పాఠశాల ముఖమే చూడని అందెశ్రీ.. 'జయ జయహే తెలంగాణ..' అంటూ ముక్కోటి గొంతుకలను ఏకం చేసి తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపితే.. రాష్ట్రం సాకారమైంది. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమం జరగలేదు. ఎన్ని వజ్రాలున్నా.. కోహినూర్‌దే మొదటిస్థానం. రేపటి తెలంగాణ చరిత్రలో కవులు, కళాకారుల గురించి ప్రస్తావన వస్తే.. అందెశ్రీ గుర్తింపు ప్రత్యేకమైనది. ఆయన కీర్తిని శాశ్వతం చేయడంతోపాటు, కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది" అని సీఎం స్పష్టం చేశారు.
కుటుంబ సభ్యుడిగా నా బాధ్యత.. "సర్వం త్యాగం చేసి ఐదు దశాబ్దాలు ప్రజల కోసం పనిచేసిన అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం.. కుటుంబ సభ్యుడిగా నా బాధ్యత. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి గద్దర్, అందెశ్రీ కృషి చేశారు. అందుకే.. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, స్మృతివనం కట్టాలని, ఆయన రాసిన నిప్పుల వాగు గ్రంథం ప్రతి గ్రంథాలయంలో ఉండేలా చర్యలు తీసుకున్నాం. ప్రజా ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 9 మంది తెలంగాణ ఉద్యమకారులు, కవులు, గాయకులను సచివాలయం సాక్షిగా సన్మానించుకోవడంతో పాటు 300 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చాం. భారత్ ఫ్యూచర్ సిటీలో అద్భుతమైన ఇళ్లను నిర్మిస్తాం. ఆ బాధ్యతను మంత్రి దామోదర్ రాజనర్సింహ తీసుకోవాలి" అని కోరారు.
"చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు మోత్కుపల్లి నర్సింహులు మొదటిసారి ఎస్సీ వర్గీకరణ చేయించారు. ఆ తర్వాత ఎన్నో అంశాల ప్రాతిపదికన అది మరుగున పడింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఇప్పుడు మీ సోదరుడిగా దాన్ని అమలు చేశా. తాత్కాలికంగా కొంతమందికి, బాధ, దుఃఖం ఉన్నా.. ఈ వర్గీకరణ అందరినీ శాశ్వతంగా ఏకం చేస్తుంది. మంత్రివర్గంలో నలుగురు దళితులున్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇది సాధ్యం కాలేదు. ప్రభుత్వంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు ముగ్గురుంటే.. నలుగురు దళితులున్నారు. 17% దళితులుంటే.. మంత్రివర్గంలో 27% కల్పించాం. అందెశ్రీ పేరిట జానపద విశ్వవిద్యాలయంతో పాటు సభలో వక్తలు చేసిన పలు సూచనలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటాం" అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.కాశీం, ప్రొఫెసర్ కోదండరాం, సాంస్కృతిక సారథి ఛైర్‌పర్సన్ వెన్నెల గద్దర్, అరుణోదయ విమలక్క, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, 'మా భూమి' సినిమా నిర్మాత నర్సింగరావు, అందెశ్రీ కుటుంబ సభ్యులు, పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు.

# దేశంలోనే అతిపెద్ద స్కామ్‌కు కుట్రకు తెరలేపిన కాంగ్రెస్ సర్కారు..

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
'కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చింది హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు.. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యామిలీ పాలసీ' అని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి కాద ని.. అమ్మకాల రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశా రు. కుంభకోణాలకు కేరాఫ్ అయిన కాం గ్రెస్.. హెచ్ఐఎల్‌టీపీ ముసుగులో 9,292 ఎకరాలను పప్పుబెల్లాల్లా పంచిపెడుతున్నదని, తద్వారా దేశంలోనే అతిపెద్ద కుంభకోణానికి తెరలేపిందని ఆరోపించారు.
శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్నదమ్ములు, సన్నిహితులు, అనుచరులు కలిసి పారిశ్రామికవేత్తలతో కుమ్మెక్కై రూ.5 లక్షల కోట్ల విలువైన విలువైన భూములను కేవలం రూ.5 వేల కోట్లకే కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. 'కేసీఆర్ పాలనలో పరిశ్రమలు, దవాఖానలు, ఐటీ పార్కులకు అనుమతులిస్తున్నట్లు మీడియాలో వార్తలు వచ్చేవి. రేవంత్ రెడ్డి పాలనలో ఓఆర్ఆర్ లోపల, బయట భూములు అమ్మకానికి పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి.
కేసీఆర్ అంటే నమ్మకం.. రేవంత్ అంటే అమ్మకం..'అని చురకలంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తె చ్చింది 'హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు.. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ' అని నిప్పులు చెరిగారు. అవుటర్ రింగురోడ్డు చుట్టుపక్కల ఉన్న భూములను టీజీఐఐసీ విలువ ప్రకారం కాకుండా సబ్ రిజిస్ట్రార్ విలువ కేవలం 30 శాతానికే ధారాదత్తం చేయాలని చూడటం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

ఎకరం భూమి కూడా మిగల్చవా?

రేవంత్‌రెడ్డి గద్దెనెక్కినప్పటి నుంచి ప్రజలకు మంచి చేయాలనే ధోరణిని పక్కనబెట్టి, భూముల పేరిట అడ్డగోలు దోపిడీపైనే దృష్టిపెట్టారని హరీశ్ రావు ఆరోపించారు. లగచర్ల, హెచ్‌సీయూ ఇలా వేల ఎకరాల భూములను తెగనమ్ముతున్నారని విరుచుకుపడ్డారు. గజాలు, ఇంచుల లెక్కన వేల ఎకరాలను తెగనమ్ముతున్నారని దుయ్యబట్టారు. హౌసింగ్‌బోర్డులో గజాలెక్కన కూడా అమ్ముకున్న ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కిందని దెప్పిపొడిచారు. బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి కోసం భూములను అమ్మితే రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడారని గుర్తు చేశారు. 'ఇలా అమ్ముకుంటూ పోతే దవాఖానలు, విద్యాలయాలు, చివరకు శ్మశనాలు కట్టేందుకు భూములు దొరకవు' అని రేవంత్ రెడ్డి సుద్దపూస మాటలు చెప్పి, ఇప్పుడు చేస్తున్నదేమిటని నిలదీశారు. 'భవిష్యత్ తరాల కోసం ఎకరం భూమి కూడా మిగల్చవా రేవంత్‌రెడ్డి?' అని సూటిగా ప్రశ్నించారు.

ఇతర రాష్ట్రాల్లో సగం ప్రభుత్వానికే

ఇతర రాష్ట్రాల్లో పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన భూములను 50 శాతం ప్రభుత్వం తీసుకొని, మిగిలిన 50 శాతం భూములను రెగ్యులరైజ్ చేస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో 50 శాతం భూములను ప్రభుత్వం తీసుకుంటే ప్రజా అవసరాలకు ఉపయోగపడేవన్నారు. లంగ్‌స్పేస్ పార్కులు, బస్‌డిపో, బస్టాండ్, హాస్పిటల్, కాలేజీ, స్కూల్.. ఇలా ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు కడదామంటే హైదరాబాద్‌లో స్థలం దొరికే పరిస్థితి లేదన్నారు. 'అనాడు బొందలగడ్డకు, శ్మశానవాటికకు స్థలాలు లేవని రేవంత్‌రెడ్డి అనలేదా.. ? ఈ రోజు బొందల గడ్డలకు జాగల్లేకుండా గజాల చొప్పున భూములు అమ్ముతున్నావు మిస్టర్.. మీది నోరా.. ? మోరా..?' అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు.
కేసీఆర్ హయాంలోనూ కోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆజామాబాద్ భూములను క్రమబద్ధీకరించామని, ఎస్ఆర్వో ధరకు 200 శాతం ఫీజు తీసుకున్నామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్ఆర్వో విలువలో 30 శాతం మాత్రమే తీసుకోవాలని నిర్ణయించడంలో అంతర్యమేంటని ప్రశ్నించారు. హెచ్ఐఎల్‌టీపీ ముసుగులో 9,292 ఎకరాలను కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పిన మాటలు అక్షర సత్యమన్నారు. ఎస్ఆర్వో విలువలో 30 శాతానికే భూముల అమ్మకం నిజమేనని ఒప్పుకున్న రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

అసెంబ్లీలో ఎందుకు చర్చించలేదు?

వేలాది ఎకరాలను అమ్మకానికి పెట్టిన హెచ్ఐఎల్‌టీపీ పాలసీపై ప్రభుత్వం అసెంబ్లీలో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. హడావుడిగా విధానపరమైన నిర్ణయం తీసుకోవడంలోని అంతర్యమేంటని నిలదీశారు. మొన్న మంత్రి చెప్పిన వివరాలతోనే సర్కారు డొల్లతనం బట్టబయలైందని నిప్పులు చెరిగారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌తో పోల్చితే రెండు రేట్ల స్కామ్ అని ఆరోపించారు. సర్కారు తీరుతో రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కుంభకోణంపై బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని, ఎందుకు మాట్లాడటంలేదని హరీశ్‌రావు నిలదీశారు. బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, కాంగ్రెస్‌తో కుమ్మకు కాకున్నా ఈ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

హెచ్ఐఎల్‌టీపీలో రేవంత్ బొనాంజా

'దసరా, దీపావళికి బొనాంజా ఆఫర్లు చూస్తుంటాం.. కానీ ఈ పాలసీలో రేవంత్‌రెడ్డి బొనాంజా ఆఫర్ పెట్టిండు' అని హరీశ్‌రావు చురకలంటించారు. 30 శాతానికే ల్యాండ్ కన్వర్షన్‌తోపాటు అందులోనే ప్రాసెసింగ్ ఫీజులు చేర్చడం దుర్మార్గమన్నారు. రెవెన్యూ, హెచ్ఎండీఏకు పైసా కట్టనవసరం లేదని, ఆల్ ఫ్రీ అంటూ రేవంత్‌రెడ్డి బొనాంజా ప్రకటించారని ఎద్దేవా చేశారు. 30 శాతమే అన్యాయమని తామంటుంటే.. ఏ ఫీజు కట్టనవసరం లేదని చెప్పడం ఏమిటని నిలదీశారు. 9,200 ఎకరాలకు హెచ్ఎండీఏ, నాలా, కన్వర్షన్ విలువ రూ.13,500 కోట్లు అని తెలిపారు. ఈ ఆదాయం వస్తే ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్ట్రామ్ వాటర్ డ్రైయిన్‌లు కట్టొచ్చు అని వివరించారు. ఈ డబ్బంతా కాంగ్రెస్ నాయకుల జేబుల్లోకి వెళ్తున్నదని ఆరోపించారు.

రెండు నెలల్లోనే పరిసమాప్తం చేసేలా..

భూములు అమ్మకంలో ప్రభుత్వం చేస్తున్న హడావుడి చూస్తనే ఇందులో ఏదో మతలబు ఉన్నదనే విషయం అర్థమవుతున్నదని చెప్పారు. 'వారంలో దరఖాస్తు చేసుకోవాలని.. మరో వారంలో టీజీఐఐసీ అప్లికేషన్ల పరిశీలన పూర్తిచేస్తుందని.. ఆ తర్వాత వారంలో అధికారుల కమిటీ అనుమతి ఇస్తుందని.. తదనంతరం 45 రోజుల్లో నగదు చెల్లింపు పూర్తిచేయాలని నిర్దేశించడంలో లోగుట్టు ఏమిటి?' అని నిలదీశారు. రూ. 5 లక్షల కుంభకోణం కథను రెండు నెలల్లోనే పరిసమాప్తం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు యత్నిస్తున్నదని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు అనాడు బీఆర్ఎస్ ఉత్తమమైన టీఎస్ఐపాస్ పాలసీని తెచ్చిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు ఉన్న భూములను తెగనమ్మడానికి హెచ్ఐఎల్‌టీపీ పాలసీని తెచ్చారని కాంగ్రెస్‌కు, బీఆర్ఎస్ ఉన్న తేడా ఇదేనని స్పష్టంచేశారు. 'బీఆర్ఎస్ పెట్టుబడులు తెచ్చింది.. పరిశ్రమలు తెచ్చింది.. ఉద్యోగాలు కల్పించింది. కానీ కాంగ్రెస్ ఉన్న భూములను అమ్ముతున్నది' అని ధ్వజమెత్తారు.

ఇది రియల్ ఎస్టేట్ బ్రోకర్ ప్రభుత్వం

ఓఆర్ఆర్ లోపలున్న కాలుష్య కారక పరిశ్రమలను మాత్రమే అవుటర్ వెలుపలికి పంపాలన్నది పాలసీ ఉద్దేశమని, కానీ కాంగ్రెస్ తెచ్చిన పాలసీతో గ్రీన్ కేటగిరీ (కాలుష్యరహిత) కంపెనీలు కూడా అవుటర్ బయటికి తరలివెళ్లాల్సి వస్తున్నదని హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో కంపెనీలు, ఉద్యోగాలు పోయే పరిస్థితి తలెత్తుతుందన్నారు. 'ఉద్యోగాల కల్పన మాది.. ఉద్యోగాలు ఊడదీసే కథ మీది' అంటూ విరుచుకుపడ్డారు. ఇది రియల్ ఎస్టేట్ బ్రోకర్ ప్రభుత్వమని, అనుయాయులకు అడ్డికి పావుశేరుకు భూములను కట్టబెట్టే ప్రభుత్వమని హరీశ్‌రావు విరుచుకుపడ్డారు.
ఆర్ఆర్ ట్యాక్స్ కోసమే గ్రీన్ కేటగిరీ పరిశ్రమలను తరలించబోతున్నారని ఆరోపించారు. తాము కాలుష్యకారక పరిశ్రమల 50శాతం భూముల్లో ఐటీ కంపెనీలు, టీ పార్కులు, మిగిలిన 50శాతం భూములను గృహ అవసరాలకు వినియోగించుకునేలా పాలసీ తెచ్చామన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం సినిమా టాకీసులు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, లే ఔట్లుగా చేసి అమ్ముకునే అవకాశం కల్పించిందని ధ్వజమెత్తారు. 'మాది ఖజానా నింపే పాలసీ. కాంగ్రెస్ వాళ్లది జేబులు నింపుకునే పాలసీ' అని అభివర్ణించారు. ఓఆర్ఆర్ లోపలున్న భూములు బంగారం లాంటి భూములని, భవిష్యత్తు అవసరాలను తీర్చేందుకు వీటిని వాడుకునే వీలుందని, కానీ ప్రభుత్వం ఈ దిశలో ప్రయత్నించడంలేదన్నారు. 'కాంగ్రెస్‌కు ఉన్న విజనల్లా జేబులు నింపుకునే, ఖజానా కొల్లగొట్టే విజన్' అని మండిపడ్డారు. ప్రజల కోసమే పనిచేసే విజన్ ఉంటే ఈ పాలసీ తేవాలనుకోరన్నారు.

శ్రీధర్‌బాబూ బహిరంగ చర్చకు సిద్ధమా?

అవుటర్ రింగురోడ్డు చుట్టు పక్కల ఉన్న రూ.5 లక్షల విలువైన 9292 ఎకరాలను రూ.5వేల కోట్లకే ప్రభుత్వం ఎందుకు ఇతరులకు కట్టబెడుతున్నదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కేటీఆర్ సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మంత్రి శ్రీధర్‌బాబు చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. పైగా 9,292 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీలు పోగా కేవలం 4,740 ఎకరాల భూమే ఉన్నదని బుకాయిస్తున్నారని మండిపడ్డారు. పైగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మంత్రి చెప్పిన మాటలు సత్యదూరమని కొట్టిపారేశారు.
'నేను రెవెన్యూ రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్‌గా చెబుతున్న. అప్పట్లో సబ్ కమిటీలో నాతోపాటు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి ఇతర మంత్రులు కూడా ఉన్నారు. ఆరు నెలల కిందటే భూముల అమ్మకం ప్రతిపాదన తెచ్చారు. నిజంగా ప్రభుత్వం 4,740 ఎకరాలే అమ్మకానికి పెట్టిందా? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా?' అని మంత్రి శ్రీధర్‌బాబుకు హరీశ్‌రావు సవాల్ విసిరారు. వాళ్లు చెప్పేది నిజమైతే తన సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు. ముమ్మాటికీ 9,292 ఎకరాలను ఎస్ఆర్వో విలువలో 30 శాతానికే అమ్మకానికి పెట్టారని తేల్చిచెప్పారు.
మంత్రి మాత్రం భూములను సగానికి తగ్గించి, భూ కుంభకోణం పరిధిని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 100 శాతం ఎస్ఆర్వో విలువతో అమ్మకానికి పెడితే ఎవరూ కొనరని చెప్పడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో 200 శాతం ఎస్ఆర్సీ విలువకు భూములను విక్రయించామని మరోసారి గుర్తుచేశారు. కోర్టుకేసులు, లీజు వివాదాలను అడ్డుపెట్టుకుని మొత్తం కొల్లగొడుతున్నారా? అని తాము ప్రశ్నిస్తే సర్కారు సమాధానం ఇవ్వడం లేదన్నారు.

భూములు కొల్లగొడితే చూస్తూ ఊరుకోం

దేశంలోనే బిగ్గెస్ట్ ల్యాండ్ స్కాం ఇది అని, దీని విలువ రూ.5లక్షల కోట్లు ఉంటుందని హరీశ్‌రావు ఆరోపించారు. ఇదంతా నాలుగు కోట్ల మంది ప్రజల ఆస్తి అని, ఐదేండ్లు పాలించేందుకు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం ఇచ్చారని, తరాలుగా వస్తున్న ఆస్తిని అమ్మేందుకు అధికారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరాలను దృష్టిలో ఉంచుకుని పాలన చేయాలని, అడ్డగోలుగా భూములు అమ్ముతామంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.
ప్రభుత్వం వెంటనే పారదర్శకమైన పాలసీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రజల ఆస్తిని కొల్లగొడితే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణే తమ బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, చింత ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.
ఎనుముల కాదు.. అమ్మకాల రేవంత్.. టీజీఐఐసీ ధరను పక్కనబెట్టి రిజిస్ట్రేషన్ విలువను పరిగణనలోకి తీసుకోవడంలో ఆంతర్యమేమిటి? హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ధరలు పెంచుతామని చెప్పి పెంచకముందే.. భూముల ధరలు సవరించకముందే.. అమలులోకి రాకముందే హెచ్ఐఎల్‌టీపీని ఎవరి మేలు కోసం తెచ్చింద్రు?
వంద రూపాయలు గజం ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం 200 తీసుకొని ప్రభుత్వ ఖజానా నింపింది. కానీ కాంగ్రెస్ ఎందుకు 30 రూపాయలకు తగ్గించింది? లక్షల కోట్లను రాష్ట్ర ఖజానాకు రాకుండా నష్టం చేస్తున్నది వాస్తవం కాదా?
జీవో 135ను తెచ్చి పేదవాడు కొన్న భూమికి రిజిస్ట్రేషన్ ధరలపై ముక్కుపిండి 80 శాతం ఎల్ఆర్ఎస్ వసూలు చేస్తున్నరు.. దరఖాస్తు, ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేస్తున్నరు. మరి పెద్దలకు ఎందుకు ఆఫర్లు?
ఈ పాలసీలో రెవెన్యూ, హెచ్ఎండీఏకు బడాబాబులు పైసా కట్టనవసరం లేదని ఆల్ ఫ్రీ అని బొనాంజా పెట్టింద్రు. అంటే పేదోడికో న్యాయం.. పెద్దోడికో న్యాయమా?
ఓఆర్ఆర్ లోపలే కాకుండా చుట్టుపక్కల భూములను కూడా కొల్లగొట్టే కుట్ర దాగి ఉన్నది. ఇది రేవంత్‌రెడ్డి, ఎనుముల సోదరుల జేబులు నింపే పాలసీనా? కాదా?
విలువైన భూములను ఎనుముల బ్రదర్స్, వాళ్ల అనుయాయులు అగ్రిమెంట్లు చేసుకున్నాక పక్కా ప్రణాళికతో ఆరు నెలల కిందటే పాలసీని రూపొందించింది నిజం కాదా?
30 శాతం డబ్బుతో పారిశ్రామిక వేత్తలకు ఇన్సెంటివ్స్ ఇస్తారా? పారిశ్రామిక వాడల అభివృద్ధికి ఉపయోగిస్తారా? లేక కమీషన్ల కోసం బడా కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపునకు వాడుతారా?

హరీశ్‌రావు ప్రశ్నల వర్షం

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పు

ఈ కుంభకోణంపై ప్రభుత్వానికి హరీశ్‌రావు 8 ప్రశ్నలను సంధించారు. తామడిగిన ప్రశ్నలకు సర్కారు, సీఎం రేవంత్‌రెడ్డి సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

1. టీజీఐఐసీ ధరను ఎందుకు పక్కనబెట్టారు?

టీజీఐఐసీ ధరను పక్కనబెట్టి రిజిస్ట్రేషన్ విలువను పరిగణలోకి తీసుకోవడంలోని అంతర్యమేమిటి?. ఉదాహరణకు మల్లాపూర్ పారిశ్రామిక వాడలో 240 ఎకరాలు ఉండగా, రిజిస్ట్రేషన్ విలువ చదరపు గజానికి రూ.17,581, టీజీఐఐసీ ధర రూ. 36,827 ఉన్నది. ఇలా రిజిస్ట్రేషన్ విలువకు టీజీఐఐసీ ధర రెండు, మూడు రెట్లు ఉంటుంది. అధికంగా ఉన్న టీజీఐఐసీ ధరను పక్కనపెట్టి రిజిస్ట్రేషన్ ధర అయిన రూ.17 వేలకే ఎందుకు మొగ్గుచూపుతున్నారు?. పైగా ఎస్ఆర్వో వ్యాల్యూలో కేవలం 30శాతం రేటుకే భూములు ఎందుకు కట్టబెడుతున్నారు?. ఉప్పల్ పారిశ్రామికవాడలోని 447 ఎకరాలకు రిజిస్ట్రేషన్ విలువ చదరపు గజానికి రూ.21,886 ఉంటే, టీజీఐఐసీ విలువ రూ. 52,523గా ఉన్నది. హయత్‌నగర్‌లో రిజిస్ట్రేషన్ విలువ రూ.14, 591 కాగా, టీజీఐఐసీ విలువ రూ.54,340. గాంధీనగర్‌లో రిజిస్ట్రేషన్ విలువ రూ.14,591గా ఉండగా, టీజీఐఐసీ విలువ రూ.46,895 మాత్రమే. టీజీఐఐసీ విలువను కాదని, రిజిస్ట్రేషన్ విలువను ఎందుకు పరిగణలోకి తీసుకున్నారో, పైగా 30 శాతానికే ఎందుకు కట్టబెడుతున్నారో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి.

2.రిజిస్ట్రేషన్ రేట్లు పెంచకుండా విక్రయాలెందుకు?

హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ ధరలు తకువగా ఉన్నాయని, త్వరలో పెంచుతామని ముఖ్యమంత్రే ప్రకటించారు. భూముల ధరలు సవరించకముందే, కొత్త ధరలు అమలులోకి రాకముందే ఈ పాలసీని ఎవరి మేలు కోసం తెచ్చారు? ఎందుకోసం హడావుడిగా అమలు చేస్తున్నారు? పప్పుబెల్లాల్లా కట్టబెట్టి.. కొల్లగొట్టి జేబులు నింపుకున్న తర్వాత భూముల ధరలు సవరిస్తారా?. అంటే పారిశ్రామికవేత్తలకు ఒక విధానం, పేదలకు ఒక విధానమా? సవరించిన భూముల రేట్లు కేవలం పేదలకేనా? ధరలు సవరించే వరకు ఓఆర్ఆర్ లోపల ఉన్న భూములు కట్టబెట్టడాన్ని ఎందుకు ఆపడం లేదు? ఏడు రోజుల్లో దరఖాస్తు, ఏడు రోజుల్లో క్లియరెన్స్, 45 రోజుల్లో డబ్బు కట్టడం వెనుకున్న మతలబేమిటి? కమీషన్ల కోసమే రిజిస్ట్రేషన్ విలువను సవరించకుండా ఈ భూములు కట్ట బెట్టడం లేదా? సమాధానం చెప్పాలి. భూముల ధరలు సవరిం చిన తర్వాత పాలసీ తెస్తే అదనపు ఆదాయం వచ్చేది కాదా?

3.30 శాతం ధరలకే ఎందుకు అమ్ముతున్నారు?

ఉదాహరణకు చదరపు గజానికి రూ.వంద విలువ ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.రెండు వందలు తీసుకొని ప్రభుత్వ ఖజానా నింపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.30కే కట్టబెడుతున్నది. అంటే రూ.170 నష్టపోతున్నది వాస్తవం కాదా? రూ.200 వసూలు చేయాల్సిన చోట రూ.30కి ఎందుకు తగ్గించారు. రాష్ట్ర ఖజానాకు రూ.లక్షల కోట్లు రాకుండా నష్టం చేస్తున్నది వాస్తవం కాదా?

4.80 శాతం ఎల్ఆర్ఎస్ వసూలు చేయలేదా?

బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెస్తే నాడు 'నో ఎల్ఆర్ఎస్, నో బీఆర్ఎస్' అని రేవంత్‌రెడ్డి అన్నాడు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరి నుంచి ముక్కుపిండి మరీ ఎల్ఆర్ఎస్ వసూలు చేశాడు. జీవో %-% 135ను తెచ్చి.. పేదవాడు కొన్న భూమికి అయితే రిజిస్ట్రేషన్ ధరలపై ముక్కుపిండి 60, 80శాతం ఎల్ఆర్ఎస్ వసూలు చేశారు. ఎల్ఆర్ఎస్ కింద పేదల నుంచి ఎస్ఆర్వో విలువలో 80 శాతం వసూలు చేశారు. దరఖాస్తు రుసుము, ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేశారు. కానీ ఇప్పుడు వేలాది ఎకరాలకు కేవలం 30 శాతమే తీసుకుంటున్నారు. పేదవాడికి ఒక న్యాయం, పెద్దోడికి ఒక న్యాయం ఉంటదా? ఈ పాలసీ ఎవరికోసమో ప్రభుత్వం సమాధానం చెప్పాలి?. రూ.వేలకోట్లకు పడగలెత్తిన బడా పారిశ్రామికవేత్తలకు ఒక రూల్.. పేదలకు ఒక రూల్ ఉందా?.

## 18 వ శాఖ తలసీమియా చికిత్స కేంద్రంగా
## రెయిన్ బో హాస్పిటల్ : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ఏఎం న్యూస్ / జూబ్లిహిల్స్ :**




తలసీమియా బాల సేవా యోజన కార్యక్రమం కింద కోల్ ఇండియా లిమిటెడ్ తో రెయిన్బో చిల్డ్రన్ హాస్పిటల్ (బంజారాహిల్స్ ఎల్.వి. ప్రసాద్ రోడ్లో లో ఉన్న) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది ఈ కార్యక్ర మానికి కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ తలసీమియా బాధితులకు అండగా ఉండేందుకు కోలిండియా తీసుకొచ్చిన తలసీమియా బాలసేవా యోజన కార్యక్రమం ద్వారా రెయిన్ బో ఆస్పత్రి అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నాను అని అన్నారు.

## పాలమూరు కార్మికులకు సంక్షేమ సంఘాల ప్రతినిధులు అండగా ఉండాలి...

**ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :**
పాలమూరు వలస కార్మికులకు, ఉద్యోగులకు పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అండగా ఉండి ఆదుకోవాలని ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన సభ్యత్వ నమోదు పోస్టర్, వాహన స్టిక్కర్ లను ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ పట్నంలో నివాసం ఉంటున్న పాలమూరు బిడ్డలు, కార్మికులు, ఉద్యోగులకు అండగా ఉండాలని అన్నారు. పాలమూరు కార్మికులకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు, సంక్షేమ ఫలాలు అందేలా సంఘం సభ్యులు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్నంలో పాలమూరు బిడ్డలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎంఏ. కరీమ్, ప్రధాన కార్యదర్శి గోపాస్ రవీందర్, వ్యవస్థాప సభ్యులు బండి బంగారయ్య(శ్రీను), శ్రీరాములు, మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మరింత గడువు ఇవ్వండి

**ఏఎం న్యూస్ / హైదరాబాద్ :**
పార్టీ ఫిరాయింపుల ఫిర్యాదుపై సమాధానం ఇచ్చేందుకు తమకు మరింత గడువు ఇవ్వాలని శాసన సభాపతి ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యేలు దానం నాగేందర్(ఖైరతాబాద్), కడియం శ్రీహరి(స్టేషన్‌ఘన్‌పూర్) కోరుతున్నారు. ఇప్పటికే సభాపతిని కలసి గడువు అడిగినట్లు కడియం శనివారం మీడియాకు తెలిపారు. నేడు(ఆదివారం) సభాపతిని కలసి మరింత గడువు కోరే అవకాశముందని దానం అనుచరులు తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కలిసేందుకు రెండు రోజుల క్రితం దిల్లీ వెళ్లిన దానం శనివారం హైదరాబాద్ రాగానే మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. ఫిరాయింపుల చట్టం కింద చర్యలకు అవకాశం ఇవ్వకుండా... ముందుగానే ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని పెద్దయెత్తున ప్రచారం సాగుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ బీఫాంపై దానం పోటీ చేసినందున పార్టీ మారినట్లు ఆధారాలున్నాయని, రాజీనామా చేస్తేనే వేటు తప్పుతుందని నేతలు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రీధర్‌బాబును కలిసి ఆయన చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దానం నాగేందర్ రాజీనామా తప్పకపోవచ్చని, కానీ ఎప్పుడు చేస్తారనేది చెప్పలేమంటూ సీనియర్ నేతలు తెలిపారు. పంచాయతీ ఎన్నికలు వస్తున్నందున వాటి తర్వాతే దానం రాజీనామా ఉంటుందనే ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా తప్పనిసరైతే తదుపరి చర్యలు, ప్రత్యామ్నాయం ఏమిటనే అంశాలపైనా దానం దృష్టి సారించినట్లు సమాచారం. ఎమ్మెల్యే పదవికి దానం రాజీనామా చేస్తే ఉప ఎన్నికలో పోటీ చేయించకుండా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేలా చూస్తే ఎలా ఉంటుందనే కోణంలోనూ కాంగ్రెస్‌లో చర్చ జరుగుతోంది. అధిష్ఠానం తీసుకునే అంతిమ నిర్ణయం ప్రకారమే చర్యలుంటాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కడియం శ్రీహరి ధీమా... తాను పార్టీ ఫిరాయింపులకు పాల్పడలేదని కడియం శ్రీహరి చెబుతున్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలకిచ్చిన హామీల అమలుకు అవసరమైన నిధుల మంజూరు కోసమే ప్రభుత్వంతో కలసి పనిచేసినట్లు ఆయన స్పష్టంచేశారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వంతో కలిసుంటే తప్పెలా అవుతుందని ఆయన వాదిస్తున్నారు. సభాపతి తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని, తాను రాజీనామా ఎందుకు చేయాలని సైతం ప్రశ్నిస్తున్నారు.

## అంతరిక్ష ప్రయాణమే సులువు

**బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్‌పై శుభాంశు శుక్లా వ్యాఖ్యలు**
**వైరల్‌లగా మారి నెట్టింటో పెద్ద ఎత్తు చర్చ**

**బెంగళూరు,నవంబర్22:**
బెంగళూరులో రోడ్ల దుస్థితి , ట్రాఫిక్ సమస్యలపై విమర్శల వర్షం కొనసాగుతూనే ఉన్నది. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు కూడా ఈ సమస్యలను లేవనెత్తారు. ఇక ఆన్‌లైన్ ట్రక్కింగ్ స్టార్టప్ బ్లాక్‌బక్ సీఈవో రాజేశ్ యాబాజీ ఏకంగా తమ ఆఫీస్‌ను బెంగళూరు నుంచి మార్చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో వ్యోమగామి శుభాన్షు శుక్లా కూడా చేరారు. అంతరిక్షంలో ప్రయాణించ డమే తేలిక..అంటూ బెంగళూరు ట్రాఫిక్‌పై వ్యోమగామి శుభాన్షు శుక్లా కామెంట్ చేశారు. అంతరిక్షయానంపై తాను చేసే ప్రసంగ సమయంతో పోలిస్తే బెంగళూరు రహదారులపై ప్రయాణం మూడు రెట్లు అధికమని వ్యోమగామి శుభాన్షు శుక్లా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారయి. గురువారం బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు హాజరయ్యే క్రమంలో మారతహళ్లి నుంచి మూడు గంటలపాటు ప్రయాణం చేయాల్సి వచ్చిందని శుక్లా పేర్కొన్నారు. ఇందులో మూడో వంతు సమయంలోనే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానన్నారు. గత జూన్‌లో 'యాగ్జియం మిషన్' ద్వారా చేపట్టిన అంతరిక్ష ప్రయాణంపై ఆయన మాట్లాడుతూ అంతరిక్షంలో అడుగుపెట్టాక మన గుండెపై మోటారు వాహనం ప్రయాణించినట్లు ఉంటుందన్నారు. అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు కనీసం వారం రోజులు పడుతుందని వివరించారు. భూమికి వచ్చాక రెండు వారాలపాటు మన శరీరం అదుపు తప్పే ఉంటుందని తన అనుభవాన్ని వివరించారు. ఈ ప్రయాణం భారతీయ అంతరిక్ష విజయానికి ప్రతీక అని తెలిశాక గర్వంగా ఉందన్నారు. మనకు, మన అంతరిక్ష ప్రగతికి హద్దుల్లేవని ప్రకటించారు. అంతరిక్షం నుంచి భారతదేశం ఎలా కనపడుతుందో శుభాన్షు వీడియో రూపంలో చూపారు. ఈ సందర్భంగా ఆయన బెంగళూరు రోడ్లు, ట్రాఫిక్ సమస్యపైనా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి. దేశ ఐటీ రాజధానిలో జరిగిన బెంగళూరు టెక్నాలజీ సమ్మిట్ లో 'ఫ్యూచర్ మేకర్స్ కాంక్లేవ్'కు శుభాన్షు శుక్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తాను మారతహళ్లి నుంచి ఎగ్జిబిషన్ సెంటర్‌కు మూడు గంటలు ప్రయాణం చేయాల్సి వచ్చింది. ఇందులో మూడో వంతు సమయంలో నే తాను ప్రసంగాన్ని పూర్తి చేశానంటూ వ్యాఖ్యానించారు. మారతహళ్లి నుంచి బీఈఎస్ వేదిక అయిన బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు మధ్య 34 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సాధారణంగా ఒక గంటలో ప్రయాణించవచ్చు.

## గవర్నర్లకు గడువు ఉండాల్సిందే

**అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలి**
**సుప్రీం తీర్పుపై తమిళనాడు సిఎం స్టాలన్ వ్యాఖ్య**

**చెన్నై,నవంబర్22:**
శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి,గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని సుప్రీం కోర్టు స్పష్టం చేయడంపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. బిల్లులపై నిర్ణయం తీసుకునేలా గవర్నర్లకు గడువు విధించే విధంగా రాజ్యాంగంలో సవరణలు తెచ్చేవరకు తమ పోరాటం ఆపబోమని వెల్లడించారు. ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌లో సుప్రీంకోర్టు ఇచ్చిన అభిప్రాయం.. ఏప్రిల్ 8 నాటి తీర్పును (తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్) ప్రభావితం చేయలేదు. వాస్తవానికి ఎన్నికైన ప్రభుత్వం డ్రైవర్ సీటులో ఉండాలని, రాష్ట్రంలో రెండు పాలక వర్గాలు ఉండకూడదని సుప్రీం తీర్పు పునరుద్ఘాటించింది. బిల్లులను పక్కన పడేసేలా వీటో అధికారం చూపే అవకాశం గవర్నర్లకు ఉండదు. బిల్లులను నిలిపివేసే అధికారం వారికి లేదు. రాష్ట్ర హక్కులు, సమాఖ్యవాదం కోసం మా పోరాటం కొనసాగుతూనే ఉంటుందని స్టాలిన్ స్పష్టం చేశారు. తమిళనాడు గవర్నర్ బిల్లులను నిరవధికంగా నిలిపివేయడాన్ని సవాల్‌చేస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం ఏప్రిల్ 8న నిర్ణయం వెలువరించింది. ఆ తీర్పు రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లుగా ఉండటంతో మే 13న ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము 14 ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం గురువారం కీలక తీర్పు వెలువరించింది. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానాలు గడువు విధించలేవని రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. అయితే తమ వద్దకు వచ్చిన బిల్లులను గవర్నర్లు అకారణంగా, నిరవధికంగా నిలిపివేయడం తగదని, సహేతుక సమయంలోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. అందుకు రాజ్యాంగ సవరణ అవసరమని ఇప్పుడు సిఎం స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

# ఆడపడుచులకు అండగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్

## - పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ...

ఏ ఎమ్ న్యూస్ శేర్లింగంపల్లి :

ఆడపడుచులకు అండగా కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ నిలుస్తోందని పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన 55 మంది లబ్ధిదారులకు యాబై ఐదు లక్షల ఆరు వేల మూడు వందల ఎనభై రూపాయల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ వివేకానంద నగర్ లోని క్యాంపు కార్యాలయంలో శనివారం అందజేశారు. కూకట్పల్లి మండలం పరిధిలోని వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ , కూకట్పల్లి (పార్ట్) డివిజన్ల పరిధిలోని పలువురికి కల్యాణ లక్ష్మి /షాదిముబారక్ పథకం ద్వారా మంజూరైన చెక్కులను కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావుతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడ బిడ్డకు పెద్ద అన్న లాగా నిలుస్తారని ఎమ్మెల్యే గాంధీ కొనియాడారు. నిరుపేదల అడా బిడ్డల పెళ్లికి దేశంలో



ఎక్కడా లేని విధంగా ,మానవతా దృక్పథంతో కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ప్రవేశపెట్టడం జరిగినదని ,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, పేదింటి వారి ఇండ్ల లో సంతోషంతో ఆడ పిల్లల పెండ్లి జరగాలని సదుద్దేశంతో కల్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకం ఎంతగానోఉపయోగపడుతుంది నీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి, నాయి నేనీ చంద్రకాంత్ రావు, మారేళ్ల శ్రీనివాస్,శివరాజు గౌడ్,మోజేశ్, చిరుమర్తి రాజు, మున్నా, బసంత్ రాజు, గోపాల్, లింగం, సత్యనారాయణ, శీనివాస్, లబ్ధిదారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## న్యూరో సమస్యతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తను పరామర్శించిన జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



కూకట్పల్లి కేపిహెచ్బీ రోడ్ నెంబర్-4లో ఉన్న హైదరాబాద్ న్యూరో సెంటర్ హాస్పిటల్లో, గత కొన్ని నెలలుగా తీవ్రమైన నరాల బలహీనత సమస్యతో బాధపడుతున్న జనసేన కార్యకర్త సూర్యానారాయణని కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ప్రేమ కుమార్ శనివారం పరామర్శించారు. సూర్యనారాయణ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి, ప్రస్తుతం జరుగుతున్న చికిత్స వివరాలు, అవసరమైన మెడికల్ టెస్ట్లు, మందులు, రికవరీ ప్రాసెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయనకు కావాల్సిన అన్ని వైద్య సాయం త్వరితగతిన అందేలా ఆసుపత్రి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే కార్యకర్త కుటుంబ సభ్యులను ధైర్యపరుస్తూ, పార్టీ తరఫున ఎల్లప్పుడూ వారి పక్కనే ఉంటామని, అవసరమైన సహాయాన్ని అందించేందుకు ముందుంటామని హామీ ఇచ్చారు. తరువాత సూర్యనారాయణతో కాసేపు మాట్లాడి, మానసికంగా ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, పార్టీ తరఫున పూర్తి మద్దతు ఉంటుందని ప్రేమ కుమార్ తెలిపారు. జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, పోలేబోయిన శ్రీనివాస్, పులగం సుబ్బు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంను సందర్శించిన బండి రమేష్

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజా నరసింహ ఆదేశాల మేరకు బండి రమేష్, డా. కోట నీలిమా ప్రకాశ్నగర్, బెగంపేట లోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంను సందర్శించారు. దాదాపు 4200 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ దేవాలయం పునర్నిర్మాణం, అభివృద్ధి విషయాలపై సమావేశంలో చర్చలు జరిగాయి. దేవాలయ నిర్మాణాల సరైన అమరిక, కమ్యూనిటీ హాల్, షట్టర్లు నిర్మించడం ద్వారా దేవాలయాన్ని స్వయం సమృద్ధిగా మార్చే మార్గాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. దేవాలయ అభివృద్ధి సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా కృషి చేస్తామనీ సరైన ప్రణాళికతో దేవాలయం స్వయం సమృద్ధి సాధించి భక్తులకు మెరుగైన సేవలు అందిస్తుంది అన్నారు. దేవాలయ పవిత్రత కాపాడుతూ అవసరమైన సదుపాయాలను అభివృద్ధి చేస్తామనీ పునర్నిర్మాణ పనులు సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ నిర్వహిస్తామనీ చెప్పారు. ఈ సమావేశాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు దేవాలయ దాత విశాల్ సుదామ్ నిర్వహించారు.ఈ సమావేశానికి చంద్రమోహన్, రమేష్, రామాదేవి, నర్సింగ్ రావు, వెంకట్ రావు, పర్వేజ్ ,అరుణ్, ఆలీ రాఘవ ,గణేష్ ,చిరంజీ, కృష్ణ , రాము ,లక్ష్మి, సునీత, మరియు దేవాలయానికి చెందిన అనేక మంది భక్తులు హాజరయ్యారు.

## స్థలాన్ని పరిశీలించిన శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాలమేరకు జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్ సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ గా బయలుదేరి అమీర్ పేట్ ప్రాంతంలోని మైత్రివనం వద్దకు వెళ్లి అక్కడ జరిగిన కార్యక్రమం ( స్వర్గీయ. ఎన్టీ రామారావు విగ్రహాన్ని స్థాపించడానికి కేటాయించబోయే స్థల పరిశీలన )లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్ తో పాటు సోమాజిగూడ డివిజన్ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, వెంగల్ రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవి రెడ్డి నాగార్జున రెడ్డి, తో పాటు కాంగ్రెస్ పార్టీ లొ నూతనంగా చేరిన రూప పాల్గొన్నారు. సోషల్ వర్కర్ అరుణ్ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరితో కలిసి తెలుగు చలనచిత్ర ప్రపంచానికి అపూర్వ సేవలందించిన, ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నెలకొన్న మహానటుడు, స్వర్గీయ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని స్థాపించడానికి మైత్రివనంలో కేటాయించబోయే స్థలాన్ని, కాంగ్రెస్ పార్టీ నాయకులు తో కలిసి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు వి.నవీన్ యాదవ్. త్వరలోనే అధికారికంగా స్థల కేటాయింపు అనంతరం విగ్రహ ఆవిష్కరణకు సంబంధించిన తదుపరి కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం ప్రకటించనుందని శాసనసభ్యులు వి. నవీన్ యాదవ్ తెలిపారు.

## గాంధీభవన్లో ఈ.ఎల్. రామయ్య శాసనాల గాలయ్య

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న గాంధీభవన్ లొ జిల్లా కాంగ్రెస్ కమిటీ( డిసిసి) సమావేశం కాంగ్రెస్ పార్టీ పెద్దలచే శనివారం నాడు నిర్వహించారు ఈ కార్యక్రమంలో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ. ఎల్. రామయ్య, శాసనాల గాలయ్య పాల్గొన్నారు వారితోపాటు డివిజన్కి సంబంధించిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. ఈ సమావేశంలో పెద్దలు చెప్పిన విషయాన్ని శ్రద్ధగా విన్నారు ఈ.ఎల్. రామయ్య. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గాంధీభవన్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు మేము సమావేశంలో పాల్గొన్నామని తెలిపారు.

## విలేకరుల సమావేశం నిర్వహించిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి

ఏ ఎం న్యూస్, జూబ్లిహిల్స్ :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవి శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం డ్రగ్స్ వద్దు బ్రో అంటుంటే వైసీపీ మాత్రం డ్రగ్స్ తీసుకో బ్రో అంటోందని అన్నారు. వైసీపీ హయాంలో దేశంలో డ్రగ్స్ ఎక్కడ పట్టుబడినా మూలాలు మాత్రం ఏపీలోనే దొరికేవి. జగన్ పాలనలో మద్యానికి బానిసలై 4వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. జగన్ హయాంలో 11వేల కేజీల డ్రగ్స్ విశాఖ మన్యంలో పట్టుబడింది. గుజరాత్ నుంచి విజయవాడకు వస్తున్నప్పుడు 9 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడింది. 1లక్షా 25 కేజీల గంజాయి అనకాపల్లి నుంచి హైదరాబాద్కు తరలిస్తుండగా పట్టుబడింది. ఇవన్నీ జగన్ హయాంలో జరిగినవే. వైసీపీయువతను మత్తుకు బానిసలు చేసి వారి జీవితాలను నాశనం చేసింది. యువతలో డ్రగ్స్ మహమ్మారి వేగంగా వ్యాపిస్తోంది. దేశంలో 30 ఏళ్ల లోపు యువకుల్లో 190 మిలియన్ల మంది మాదకద్రవ్యాల వాడకానికి గురవుతున్నారు. దీనివల్ల వారి ఆరోగ్యం, భవిష్యత్తు పాడవుతోంది. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మత్తుకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోకూడదని కూటమి ప్రభుత్వం ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రంలో గంజాయి పేరు వినిపించకుండా ఉక్కుపాదం మోపింది. వైసీపీ మాత్రం డ్రగ్స్ ను ప్రోత్సహిస్తూ యువత జీవితాలతో ఆడుకుంటోంది. కొండారెడ్డి వైసీపీలో ముఖ్యనేతలకు దగ్గరి వ్యక్తి. ఇలాంటి వాళ్లతో రాష్ట్రంలో గంజాయి సరఫరా పెరిగిపోయింది. వైసీపీ హయాంలో విశాఖను డ్రగ్స్ రాజధానిగా మార్చారు. ఇటీవల ఈగల్ టీంకి పట్టుబడిన లోహిత్ యాదవ్ వైసీపీ యువనేత కొండారెడ్డితో కలిసి వైజాగ్ ని డ్రగ్స్ అడ్డాగా ఎలా మార్చారో పోలీసులకు వివరించాడు. కూటమి ప్రభుత్వం గం జాయి నిర్మూలనపై పటిష్ఠ చర్యలు ద్వారా 'గంజాయి ఆంధ్రప్రదేశ్' అనే మచ్చను తొలగించి, మళ్ళీ 'అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్'గారాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోంది. రాష్ట్రాన్ని మాదకద్రవ్యాలులేని రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కఠినచర్యలు తీసుకుంటోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక మంత్రుల కమిటీ నిత్యం పరివేక్షి స్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో గంజాయి మత్తు యువత దరిచేరకుండా కూటమి ప్రభుత్వం ఈగల్తో పటిష్ట చర్యలు చేపట్టింది. ప్రజలు గమనిస్తున్నారు. హైదరాబాద్లో ఆడిన హైడ్రామా, సృష్టించిన వీరంగం అక్కడ చెల్లింది. ఇక్కడ చెల్లదు. వ్యంగమైన పోస్టులు పెట్టటం చేస్తున్నారు. అలజడులు సృష్టించడం వైసీపీ లక్షణంఅనిఅన్నారు. రాష్ట్రం,దేశం అభివృద్ధిబాటలో నడవాలని ఉండవల్లి శ్రీదేవి సూచించారు.

# నేరాల నియంత్రణకు సంక్షేమ సంఘాల సభ్యులు సహకరించాలి

## జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :

సంక్షేమ సంఘాల సభ్యుల సహకారంతో నేరాలను నియంత్రించి నిందితులను శిక్షించగలమని జగద్గిరిగుట్ట సీఐ వెంకటేశం తెలిపారు. కూకట్ పల్లి డివిజన్లోని పాపిరెడ్డి నగర్ లో గల శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం ఆవరణలోని కమిటీ హాల్లో పాపిరెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఊట్ల చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సిఐ వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. బస్తీలో చేపట్టే అక్రమ పార్కింగ్ల ద్వారా ఎవరికైనా అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాలంటే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడంతో పాటుగా ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారం ఉందన్నారు. అంబులెన్స్ ఇతర వాహనాలు సరైన సమయంలో చేరుకోలేక అనారోగ్యంతో బాధపడుతున్న వారు మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గంజాయి సేవించే యువతతో నేరాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. గంజాయి విక్రయాలు వాడకాలను పూర్తిగా నిషేధించాలంటూ అవగాహన కల్పించారు.



బస్తీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకో వడం ద్వారా నేరాలను ఇట్టే నియంత్రించగలమన్నారు. బస్తీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కల్పిస్తూ ప్రజలను తికమక పెడుతూ అసత్య ఆరోపణలు చేసే వారిపై ఫిర్యాదు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు రూపాయలకే 20 లీటర్ల వాటర్ ప్లాంటును సీఐ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో బస్తీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నరసింహులు ముదిరాజ్, ఆలయ కమిటీ చైర్మన్ పి. ధర్మారావు, అధ్యక్షులు ఆడెపు ప్రభాకర్, కె.వి. రాజు, రాపోలు తిరుపతిరెడ్డి, వనంఆంజనేయులు, ఎం.శ్రీనివాస్, ముత్యం వెంకట్ రెడ్డి, తడకల రాజిరెడ్డి, రామిరెడ్డి, సత్య నారాయణరెడ్డి, తాటి కిరణ్, హను మంత రెడ్డి, ప్రకాష్, లక్ష్మమ్మ, మనక్క, సులోచన, శివ, యాదవ రెడ్డి, కనకయ్య, మహిళా నేతలు పాల్గొన్నారు.

## యూనిటీ మార్చ్ను విజయవంతం చేయాలి

### - జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్

ఏ ఎం న్యూస్ /హైదరాబాద్ :



సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి ఉత్సవాలలో భాగంగా బీజేపీ ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించనున్న యూ నిటీ మార్చ్ ను విజయవంతం చేయాలని మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్ గౌడ్,బీజేపీ నాయకురాలు కుష్బూ గుప్తా, మేకల సారంగపాణి, రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సీతాఫల్ మండిలో వారు మీడియాతో మాట్లాడుతూ నిజాం ఆధీనంలో ఉన్న హైద్రాబాద్ కు స్వాంతంత్రం తెచ్చిన ఘనత వల్లభాయ్ పటేల్కు ఉందన్నారు. సీతాఫల్ మండి శివాజీ విగ్రహం నుండి చిలకల గూడ వరకు సుమారు 10వేల మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిదులుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావులు పాల్గొంటారని తెలిపారు. విజన్ 2047 కోసం పనిచేయాలని పిలుపునిస్తూ, ఆత్మ నిర్బర భారత్ కోసం మోడీ అహర్నిశలు శ్రమిస్తూ పనిచేస్తున్నారన్నారు. స్వదేశీ వస్తు వాడకంలో చైతన్యం తీసుకు రావ డానికి కృషి చేస్తున్నామన్నారు. మోడీ కలలు కంటున్న వికసిత భారత దేశ ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్య క్రమంలో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి,నాగేశ్వర్ రెడ్డి, మద్దెర్ల శ్యామ్, వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, రాము వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉస్మానియా సమగ్ర అభివృద్ధి కై విద్యార్థి సభ

### ఏబీవీపీ ఉస్మానియా యూనివర్సిటీ కార్యదర్శి శివశంకర్

ఏ ఎం న్యూస్ ఓయూ:



వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎందరికో మార్గదర్శకంగా నిలి చింది. జ్ఞానసరస్వతి నిలయమైన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యారంగానికి తలమానికంగా నిలుస్తోంది. ఉస్మానియాలో చదవడం అనేది అనేకమంది విద్యార్థులకు ఒక భాగ్యం, ఒక గౌరవంగా భావించబడుతోంది. నూతనంగా అడుగుపెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ, ఉస్మానియా విశ్వవిద్యాలయ గొప్పతనాన్ని, పూర్వ వైభవాన్ని తెలియజేసి, దానిని తిరిగి తేవడంలో మనమందరం భాగస్వాములు కావాలని కోరుతున్నాము. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నవంబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించబోయే నూతన విద్యార్థుల స్వాగత సభకు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తోంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా డిసెంబర్లో విడుదల చేస్తానన్న 1000 కోట్ల రూపాయల నిధులను కేటాయించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుంది. ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని స్టాన్ఫోర్డ్-ఆక్స్ఫర్డ్ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రేపు జరగబోయే ఉస్మానియా విద్యార్థి సమగ్ర అభివృద్ధి సభలో పాల్గొని మనయొక్క అభిప్రాయాలు తెలియజేసి ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధి కై సమర శంఖం పూరిద్దాం.

## తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీకి పద్మశ్రీ ప్రకటించాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్

ఏ ఎం న్యూస్ ఓయూ:





కేంద్ర ప్రభుత్వం ప్రముఖ కవి, తెలంగాణ రాష్ట్ర గీతం రచయిత అందెశ్రీకి పద్మశ్రీ ప్రకటించాలని ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. నేడు రవీంద్ర భారతి లో జరిగే అందెశ్రీ సంతాప సభకు ఓయూ జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నుంచి రవీంద్ర భారతికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు సంతాప సభకు బయలుదేరి వెళ్లారు. కొత్తపల్లి తిరుపతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పైన అందెశ్రీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సభకు విద్యార్థులు పెద్ద ఎత్తున తరలు రావాలని పిలుపునిచ్చారు.లక్ష్మణ్, రమేష్, రాజేందర్, శివ, ప్రణయ్, నరేష్, శ్రీను, నరేందర్, సంతోష్, జోష్, ప్రశాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య నగర్లో సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.నిరంజన్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో మహా పడిపూజ కార్యక్రమం...

అఖిలభారత అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు అరుణ్ గురుస్వామి కరకములచే ప్రత్యేకపూజలు...

ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి...

ఏ ఎం న్యూస్, కూకట్పల్లి :



శేర్లింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ డివిజన్ ఆదిత్య నగర్లో స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు పి నిరంజన్ రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి శ్రీ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. అఖిలభారత అయ్యప్ప సేవా సమితి అధ్యక్షులు మాన్య శ్రీ అరుణ్ గురు స్వామి కరకములచే మహా పడిపూజ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం కమిటీ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు గురుస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగపుత్ర నర్సింగ్ రావు ఆధ్వర్యంలో అయ్యప్ప భజన కార్యక్రమం అట్టహాసంగా కొనసాగింది. పరిసర ప్రాంతాలకు చెందిన అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని అల్పాహారాన్ని స్వీకరించారు. మహా పడిపూజ కార్యక్రమంలో బిజెపి నాయకులు అల్లూరి రామరాజు, అల్లిపురం గోపాలరావు, పి. లిఖిత్ కన్నస్వామి, ఆదిత్య నగర్ సంక్షేమ సంఘం నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నేతలు తదితరులు పాల్గొన్నారు.

